# వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో బహుమతి పొందిన కవితలు

## ఉత్తమ కవిత విభాగం

*బహుమతి పొందిన కవిత - 1*

### సంభవామి యుగే యుగే .....

- స్వాతీ శ్రీపాద – **Union City, CA**

మళ్ళీ మళ్ళీ పుడుతూనేవుంటా
మనిషిగా మనసున్న మనిషిగా
మళ్ళీ మళ్ళీ పుడుతూనే వుంటాను.
పొత్తిళ్ళ అసహాయతలో లాలించి
వెన్నుదట్టిన స్పర్శ ఆనవాలు కోసం
కను చూపు ప్రేమ వివశతలో
సప్త సముద్రాల నీలిమ రంగరించి
భావౌన్నత్యపు అలల కదలికల్లో ఊయల్లూపి
గతం భవిష్యత్తుల యుగాల
అనుభవం అక్షరాలుగా దిద్దించిన అమ్మనై
మళ్ళీ మళ్ళీ పుడుతూనేవుంటాను.

ఊహకందనిలోతులు  అనుభూతులు
కనిపించకుండా వినిపించకుండా రూపం లేని
సౌకుమర్యపు మధురిమలుకదిలించే
చూపానని లోకాలను కొలిచి
పక్కనున్నా పదియుగాల ఆవలనున్నా
తుళ్ళింపజేసే జలపాతపు జ్ఞాపకాలకోసం
మళ్ళీ మళ్ళీ పుడుతూనేవుంటాను.

ఊపిరి సాగిన ప్రతి క్షణం సాగిలపడి
సుప్త శూన్యాల ఖాళీ మందిరాల నిండా
మాటల పారిజాతాల ప్రవాహాలు నింపే  మనుగడలో
హృదయపు లోలోపలి అంతః పురంలో
వికసిస్తున్న స్వర్గధామం కోసం
మళ్ళీ మళ్ళీ పుడుతూనేవుంటాను.

మనిషినించి మనీషిని సృష్టించే
పరసవేది దాచుకున్న
మానవత్వపు మహిమాన్విత వరం
రెండు చేతులా పంచేందుకు
తరాల తరబడి చరిత్ర సారవంతం చేసే
ప్రేమ జీవనదులు పరిరక్షించేందుకు
మనిషిగా మనసున్న మనిషిగా
మళ్ళీ మళ్ళీ పుడుతూనేవుంటాను.

✯ ✯ ✯

## బహుమతి పొందిన కవిత - 2

# ముద్దుల బాధ్యత ఒక రక్షణ కంకణం

- డా.నారాయణ గరిమెళ్ళ – **Reston, VA**

ఉదయాన్నే
భూమిని దోసిల్లోకి తీసుకుని
ఆకుపచ్చని ముద్దివ్వడం
అలవాటైన ఆకాంక్ష..
పచ్చదనం
చెరిగిపోతున్నంతమేరా
ప్రతి ముద్దూ ఒక చెట్ల తివాచీని పరచి
జీవాన్ని ఇనుమడించాలని తాపత్రయం..
ట్రోపో, స్ట్రాటో, ఐనో ఆవరణాల
దుప్పటిని కప్పుకుని
మురిపాల పాపాయి
ఇప్పుడా ఆవరణాల మధ్యలో తనకు తనే బందీ..
మూతపెట్టిన వేడిలో, కాలుష్యంలో
దగ్గుతో, తుమ్ములతో ఉక్కిరి బిక్కిరైపోతూ
కవచానికి చిల్లులు పెట్టేసుకుంటోంది..!
అందరి దోసిళ్ళలోకి అదే ప్రేమతో
అమరిపోగలిగే బుజ్జాయి పై
ప్రేమలేదని తెలిసిపోయింది..
తన దేహం నిండా మలినాలను విదుల్చుకుని
పోతున్న మన బాధ్యతా  రాహిత్యాన్ని
నిరసిస్తూ తను ఎక్కడికో వెళ్ళిపోతానంటోంది..
ఏదో ఐపోతానంటోంది..

పొగచూరిన చేతులతో తన గాయాలను
తను సవరించుకోలేక పోతోంది...
రక్తంలో కలసిపోయి మరీ
ప్రాణుల్ని రక్షించాలని కంకణాలు కట్టుకున్న
తెల్ల రక్త కణాల్లా
మనం కూడా భూమికి రక్షకులవ్వాలి
రోగనిరోధక శక్తినివ్వాలి
రోగాల్ని కాదు..!

✲ ✲ ✲

*ప్రశంసాపత్రం పొందిన కవిత - 1*

## అస్తమయం - నిష్క్రమణం

- మూర్తి మధిర – **Portland, OR**

**సంధ్య చీకట్లను చీల్చుకుంటూ ఉదయించిన భానుడు**
తల్లి ప్రసవ వేదనకు తెర దించుతూ జనియించిన బాలుడు

మానవాళికి వెచ్చని కిరణాలను ప్రసరిస్తూ సాగిన పయనం
చూచినవారికందరికీ ఆనందాన్నిస్తూ గడచిన బాల్యం

మధ్యాహ్న సమయానికి విశ్వాన్ని వేడెక్కించిన మహా మార్తాండుడు
సమస్యలతో సతమతమై విసుగు వేడిని వెళ్ళగక్కుతున్న మధ్యవయస్కుడు

తనకూ అలసట ఉన్నదన్నట్లుగా వాడి తగ్గిన సాయంకాల సూర్యుడు
బాధ్యతల బరువును దించుకుని అలుపు తీర్చుకుంటున్న వృద్ధుడు

మర్నాడు వస్తానంటూ సంధ్య చీకట్ల మాటుకు అర్కుని అస్తమయం

మరు జన్మ ఓ ప్రశ్నార్థకమంటూ తిరిగి రాని లోకాలకు మానవుని నిష్క్రమణం

✡ ✡ ✡

## ప్రశంసాపత్రం పొందిన కవిత - 2

## నేనెవర్ని దేవుణ్ణి ప్రశ్నించడానికి...

- మద్దూరి శివప్రసాద్ -Poplar Buff, MO

పెద్దచేప చిన్నచేపను

కబళిస్తుంది

ఆకాశంలో పయనించే గద్ద

నేలమీది కోడిపిల్లను ఎత్తుకుపోతుంది

తనశక్తితో గజరాజును భయపెట్టగల శార్దూలం

బలం లేని లేడిని వేటాడుతుంది

ఇవే సృష్టికర్త విలాసాలైతే

నేనెవర్ని ఆ దేవుణ్ణి ప్రశ్నించడానికి..!

బలవంతుడు బలహీనుణ్ణి

ధనవంతుడు పేదవాణ్ణి

అధికారుడు గుమాస్తాను

పదవిలో ఉన్నవాడు సామాన్యుణ్ణి

దౌర్జన్యం అసహాయతను

పీడించడమే మామూలైతే

నేనెవర్ని ఆ దేవుణ్ణి ప్రశ్నించడానికి...

గల్ఫ్ వార్‌లో ప్రవహించిన రక్తపుటేరు

చైనాలో అడుగంటిన మానవహక్కులు

రాజకీయాల్లో తప్పు బయటకు రాని నీగ్రోల సమానత్వం

ఉద్యోగాలు, కాలేజీ సీట్లకిచ్చే లక్షలు

ఓట్లకు తప్ప ఎందుకూ పనికిరాని నాయకుల వాగ్దానాలు
ఇవన్నీ కూడా దేవకార్యాలైతే
నేనెవర్ని దేవుణ్ణి ప్రశ్నించడానికి..!

✲ ✲ ✲

## నా మొట్టమొదటి కవిత విభాగం

*బహుమతి పొందిన కవిత - 1*

### అంతఃకరణ

- రమణీ విష్ణుభొట్ల - **Austin, TX**

**భాష కందని భావంలా**
కుంచెకందని వర్ణంలా
ఉలికి అందని శిల్పంలా
కదిలేవు నీవు, నా మది మెదిలేవు నీవు!
మురళి కందని లీనంలా
స్వరము కందని గానంలా
పదము కందని నాట్యంలా
కదిలేవు నీవు, నా మది మెదిలేవు నీవు..!
మనసుకందని మమతలా
చూపుకందని రూపులా
స్పర్శకందని సొంపులా
కదిలేవు నీవు, నా మది మెదిలేవు నీవు..!
అయినా
భావి దర్శన కాంతి వై
సన్మార్గ దర్శక క్రాంతివై
వెన్ను చరిచే దన్నువై

తెలిసేవు నన్ను

మనిషిగా మలిచేవు నన్ను..!

✫ ✫ ✫

## *బహుమతి పొందిన కవిత - 2*

## నీకు దూరంగా

- ప్రియాంక మిరియంపల్లి - **Farmington Hills, MI**

**కళ్ళలో వెలుగుతున్న కోటి తారల కాంతులు,**

నవ్వులో మెదులుతున్న చిరు ఆశల దీపాలు,

ఆనందపు అంచులు తాకిన మధురక్షణాలు,

ఆనందపు అంచులు తాకిన మధురక్షణాలు,

కన్నీటి నదిలో కొట్టుకుపోయిన కాలాలు,

నీతో చెప్పాలనుకున్న ఎన్నో కబుర్లు,

నీతో పంచుకుందామనుకున్న మరెన్నో ఊసులు,

నాలో నాకునిత్యం జరిగే సంఘర్షణలు,

నీకు వ్యక్తపరచానుకునే నా మనోభావాలు,

నీకు మాత్రమే చెప్పుకోగలిగే నాలోని బాధలు

నీ దగ్గర మాత్రమే దొరికే నా చిన్ని ఆనందాలు,

నా మనసులో దాచుకున్న నీ చక్కని రూపం,

నా అరచేతిలో నీ స్పర్శ తాలూకు తొలిజ్ఞాపకం,

అన్నీ నీకై నా గుండెగూటిలో దాచిపెట్టుకున్నా..

అవన్నీ నీ గుండెగుడిలోకి పదిలంగా చేర్చాలనుకున్నా

ఆర్తిగా నీ హృదయద్వారాన్ని తట్టి నీ మదిగదిలో అడుగిడిన వేళ..

అక్కడ నా రూపు కానరాక,,నా జాడే తెలియక తికమక పడుతుంటే..

నేనెవరో తెలియదన్నట్టు నీవు చూసిన చూపు..

నా నవనాడులని కృంగదీస్తుంటే

నీ మనసులో నేను లేనన్న చేదునిజం..

ఎదురుగా నిలబడి వెక్కిరిస్తుంటే

పాతాళ లోకాలకు నా ప్రాణం జారిపోతుంటే

నిరీవ నిశీధిలోకి నేను తరలి పోతుంటే

చీకటి లోయలలోకి నేను  మరలిపోతుంటే

నీలో లేని నా మనసుని వెదుకుతూ

నీకు దూరంగా..నాలో ఉన్న నీ మనసుకి దగ్గరగా వెళ్ళిపోతున్నా..!

✯ ✯ ✯

*ప్రశంసాపత్రం పొందిన కవిత - I*

## 2839 – హౌరా మెయిల్

– నసీమ్ షైక్ **- Dallas, TX**

**తూర్పునుంచి దక్షిణానికి**
గాలి వీస్తుందో లేదో కాని
నేను రోజూ రేగే గాలి దుమారాన్ని,
తీరం వెంబడి ఉన్న రెండు తీరాల్ని
కలుపుకుంటూ తిరిగే తిరుగుబోతుని,
నేను హౌరా మెయిల్‌ని, రైలు బండిని!
విహరించడానికి కొందరు
వ్యాపారాల కోసం కొందరు
ఉపాధికోసం మరికొందరు
నా ప్రయాణికులే అందరూ
నాతోటి తిరుగుబోతులే వీళ్ళందరూ!
అందరి అవసరం ప్రయాణమే
నేను అందించే విలాసం మాత్రం వేరే
రిజర్వేషన్లు రాజ్యమేలుతున్న ఈ దేశంలో

మతం పేరిట, కులం పేరిట జనాన్ని విడగొడితే
ప్రయాణం చేసే  వాడి పాకెట్ సైజుని బట్టి నన్ను విడదీశారు..!
విమానం టిక్కెట్టు దొరక్కో, విమానాశ్రయం లేకో
అప్పుడప్పుడూ చుట్టపు చూపు చూసే
ధనవంతులకోసం 6 బోగీలు
ఇక్కడ జనం తక్కువ - జాగా ఎక్కువ!
రైల్ టిక్కెట్ కి ఎక్కువై , విమానం టిక్కెట్ కి తక్కువై
నన్ను ఆశ్రయించే విదేశీకంపెనీల
అధికజీతాల కార్మికులకి
మడత మంచాల బోగీలు 18
ఇక్కడ జనం ఎక్కువే - జాగా ఎక్కువే!
పేంట్రీకి ఒకటి , పోస్ట్ బాక్స్ కి ఒకటి పంచగా మిగిలిన 3 పెట్టెల్లో
మూడు పూటలా తిండి దొరక్క
పనులకోసం ఊళ్ళు వదిలే వలస వాదులకోసం..
ముందు ఒకటి వెనుక ఒకటిన్నర జనరల్ పెట్టెలు
ఇక్కడ జనం జాతర..జాగా ఖాతిరి
చూసారా ఎంత అసమానంగా ఉన్నానో! అచ్చం భారతదేశం లాగా
పేరుకు నేను హౌరా మెయిల్ ని ఐనా
నా జనరల్ పెట్టెలో ఎక్కినవాళ్ళకి
అండమాని జైలుని!
అంతరిక్షంలో వ్యోమగాములు గాలిలో తేలుతూ ఉంటారంట
గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం వలన
నా జనరల్ పెట్టెలో కూడా జనం గాలిలో వేలాడుతూ ఉంటారు!
కాలు పెట్టడానికి కూడా స్థలం లేకపోవడం వలన!
కూర్చోడానికి స్థలం ఉన్నా లేకపోయినా
బతుకుబండిని ఈడ్చడానికి నా బండి ఎక్కడం తప్పదు వాళ్ళకు
బంధువులు లేకున్నా, భాషరాకున్నా
పూటగడుపుకోడానికి పక్క రాష్ట్రాల గడప తొక్కడమే వీళ్ళగతి!

అందుకే నేను రోజూ అలుపు లేకుండా ఆగకుండా తిరిగేది వీళ్ళకోసమే

మిడబడుతున్న బాధ్యతలు మోయడానికి

మోయలేని బరువులు ఎత్తడానికి

బయలుదేరిన వాళ్ళ కష్టాన్ని పంచుకోడానికి

అటు ఇటు అర్ధరాత్రి బయలుదేరే నేను

ఎప్పుడూ  చీకటేనా అని తిట్టుకోను

చీకటిని చీల్చుకుంటూ వెలుగుకోసం కదులుతాను

చీకటిని చీల్చుకుంటూ వెలుగుకోసం కదులుతాను!

చీకటిని దాటాలనుకునే వాళ్ళకు చేదోడుగా నిలుస్తాను.

పేదోడి పేరు చెప్పుకునే పెరుగుతున్న పార్టీలకంటే

వాళ్ళ ఓట్లు వేయించుకుని బలిసే పందికొక్కులకంటే

నేను చాలా నయం..! తక్కువ ప్రతిఫలంతో పెరిగెడుతున్నా!

ఏమిటా ప్రతిఫలం అనుకుంటున్నారా?

తినిపారేసిన శనక్కాయల తొక్కలు

నమిలి ఊసిన పాన్ పరాగ్ మరకలు,

ఇవే వాళ్ళు నాకు ఇచ్చే టిప్పు

వీటితోనే పూర్తవుతుంది నా ట్రిప్పు!

వలస వాదులను ఊర్లు చేరుస్తూ

వాళ్ళకోరికలు తీరటంలో సహాయ పడుతున్న

నాకు ఒక కోరిక ఉంది..

రాష్ట్రాలకోసం, రాజ్యాధికారాలకోసం తపిస్తున్న నాయకులకి

కోట్లు కూడబెట్టుకుంటున్న రాజాలకు, రాజులకు..ఇదే నా కోరిక

నాలో ఎక్కే జనాలకి సరిపోయేంతగా జనరల్ పెట్టెలు పెంచండి..లేదా

జనరల్ పెట్టెల్లో జనం ఎక్కలేనంతగా ఈ దేశంలో వలసలు తగ్గించండి..

(ఇదెలాగో మీ వల్లకాదు ..పెట్టెలు పెంచడమే కొంచెం సాధ్యం)

ఇంకా ఉంటాను.. నేను కూత పెట్టే టైమ్ ఐంది...

నేను పెట్టే కూత పైకి కూ... చిక్ చిక్ అని వినిపించినా దాని అసలు అర్థం ఇదే.

పితః భారతేరే శ్వే స్వరాజ్ కరో జాగారితో (బెంగాలు లో నా కూత)

మో భగవాన్ మో దేసకో జగాయిచంతి (ఒరిస్సాలో నా కూత)

భగవంతుడా నా దేశాన్ని మేల్కొలుపు( ఆంధ్రప్రదేశ్ లో నాకూత)

కదవులై ఎన నాట విళితెలు చెయ్యుం (తమిళనాడులో నా కూత)

ఇంకా అర్థం కాలేదా..

**My Lord Awake My Country..!**

## ప్రశంసాపత్రం పొందిన కవిత - 2

## చిరునామా

- సుశ్మిత శ్రీరామ్ **– Rancho Cordova, CA**

**ఇక్కడో మనసు సజీవంగా వుండేది**

హృదయమంతా ఆశలు పూచే వేళలో ............

ఎన్నో కోర్కెలు దాని చుట్టూరా  ఉత్సాహంగా పహారా కాస్తుండేవి

సుస్వప్నాలని నిజ మార్గాన నడిపేందుకు

హృదయం ఎడారి ఏకాంతమైనపుడు,

జీవితం కాన్వాస్ నిండా ఆసక్త చిత్రకారుడినై చిత్రించిన నా ఆశలు

అదే శ్వాసగా,నేను చూసే చూపుగా

జీవన చిత్రానికి రంగులద్దుకుంటూ ..............

ఏకాంతపు విల్లుపోటుకు సొమ్మసిల్లిన పావురమైనపుడు సహచర్యపు ఓదార్పు కరువై?

ఈ జ్ఞాపకాలని ఖాళీ  చేసిపోతున్నపుడు

నా చిరునామా నాకు  కావాలి

మరో లోకానికి దరఖాస్తు చేసేందుకు

*(విజేతలందరికీ 'కౌముది ' అభినందనలందిస్తోంది)*

**Post your comments**